



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, అక్టోబర్ 4, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

- సింగిల్ బెంచ్ తీర్పు కొట్టివేత కుదరదన్న హైకోర్టు
- 24న వాదనలు వింటామని స్పష్టం చేసిన ధర్మాసనం

**హైదరాబాద్, అక్టోబర్ 3:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు మరో కీలక పరిణామం జరిగింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించింది. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయంపై ఈనెల 24న వాదనలను వింటామని తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సహా పలువురు వేసిన పిటిషన్ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది. నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది. లేకుంటే సుమోటోగా తామే ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు

మిగతా 2 లో

## బేషరతుగా క్షమాపణలు చెబుతున్న..



- వివాదం ముదరడంతో వెనక్కి తగ్గిన కొండా సురేఖ
- వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడి

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్న వేళ.. ఆమె ఓ మెట్టు దిగొచ్చారు. అక్కినేని, సమంత కుటుంబానికి బాధించడం తన ఉద్దేశం కాదని ఆమె అన్నారు. ఈ మేరకు సమంత ఎక్స్ పోస్ట్‌కు మంత్రి సమాధానం ఇచ్చారు. సినీ రంగంలో సమంత ఎదిగిన తీరు తనకు ఆదర్శమన్నారు.

**వరంగల్, అక్టోబర్ 3 :** 'మహిళా నాయకుల పట్ల ఓ నాయకుడి చిన్నచూపు ధోరణి ప్రశ్నించాలన్నదే నా ఉద్దేశం. మీ మనోభావాలు దెబ్బ తీయాలని కాదు. స్వశక్తితో మీరు ఎదిగిన తీరు నాకు ఆదర్శం. మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైతే నా వ్యాఖ్యల ను ఉపసంహరించుకుంటున్నా. క్షమించండి' అంటూ సమంతకు ఎక్స్‌లో రీపోస్ట్ చేశారు.

మిగతా 2 లో

## దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ భయాలు



- మార్కెట్‌ను కుదిపేసిన ఘర్షణ వాతావరణం
- ఆవిరైన దాదాపు రూ.11 లక్షల కోట్లు

.. వివరాలు 5లో

## ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు భూమి ఇవ్వాలి

- తగిన నష్టపరిహారం ఇవ్వకుంటే ఆందోళన తప్పదు
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన ఎంపీ ఈటెల రాజేందర్



4 లో..

**హైదరాబాద్ :** ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు ప్రధానమైన నాలుగు రహదారులు విస్తరణ విషయంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం లేదా భూమి కేటాయించాలని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితుల తో కలిసి పెద్ద ఎత్తున అందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు.

## ఎస్సీ వాటా 15 పక్కన పెట్టి టీచర్ల నియామకాలు చేయాలి



వర్గీకరణ అమలుతోనే మాదిగలకు న్యాయం

తెలంగాణ మాదిగ సంఘాల ఐక్య వేదిక సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేత

## వైవాహిక అత్యాచారం నేరం కాదు



- భార్య అనుమతి లేకుండా జరిపే శృంగారాన్ని క్రిమినల్ చర్యగా పరిగణించలేం
- నేరంగా గుర్తిస్తే వివాహ వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- వైవాహిక అత్యాచారంపై ఇతర చట్టాల ప్రకారం కేసులు పెట్టొచ్చు.. సుప్రీంకోర్టులో కేంద్రం



## గ్రూప్-1పై అభ్యంతరాలకు అర్థం లేదు

::: హైకోర్టులో వాదనలు.. విచారణ నేటికి వాయిదా

## మూసీ మురికి అంతా వారి నోట్లోనే: కేటీఆర్



- ఇంకా శుద్ధి ఎందుకు, లక్షన్నర కోట్ల ఖర్చు ఎందుకు?:కేటీఆర్
- నమామి గంగేకు కిలోమీటరుకు రూ.17 కోట్లు, మూసీకి 2,700 కోట్లా?
- రేవంత్ ధన దాహం, కుంభకోణాలకు సామాన్యులు బలి అవుతున్నారు
- పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం సీఎం పాలనా వైఫల్యానికి నిదర్శనం

హైదరాబాద్: 'మూసీ మురికి అంతా వాళ్ల నోట్లోనే.. ఇంకా శుద్ధి ఎందుకు, లక్షన్నర కోట్ల రూపాయల ఖర్చు ఎందుకు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ నేతలను ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్, మంత్రులు తనపై చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా వ్యాఖ్యలు చేసిన ఓ మంత్రికి లీగల్ నోటీసులు పంపించానని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ వికారాలకు పాల్పడుతోందని అన్నారు. సీఎంతో పాటు తనపై వ్యాఖ్యలు చేసిన మంత్రిని మానసిక ఆరోగ్య నిపుణుల వద్దకు లేదా మానసిక వైద్యుల వద్దకు పంపాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఆయన కోరారు. రాష్ట్రంలోని అనేక అంశాలకు సంబంధించి కేటీఆర్ గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో వరుస పోస్ట్‌లు చేశారు. గంగానది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన

(మిగతా 2వ పేజీలో)

## తిరుపతి లడ్డూపై సుప్రీం విచారణ నేటికి వాయిదా



న్యూఢిల్లీ, అక్టోబరు 3 : తిరుమల శ్రీవేంకటేశ్వరుడ్డి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తునే కొనసాగించాలా.. లేక కేంద్రం విచారణ జరిపించాలా అన్న అంశంపై సస్పెన్స్ శుక్రవారం వీడనుంది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని శుక్రవారం చెబుతామని, అప్పటివరకు సమయం కావాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టును కోరారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఇందుకు అంగీకరించింది. శుక్రవారం దీనిని తొలి కేసుగా విచారిస్తామని తెలిపింది. వాస్తవానికి గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కేసు విచారణకు రావలసింది. దానికి

(మిగతా 2వ పేజీలో)




## పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

ఇండ్లు కూలగొట్టడే ఇందిరమ్మ రాజ్యమా?: హరీశ్

## 15% వృద్ధి రేటు లక్ష్యం

కొత్త పాలసీలతో అన్ని రంగాలనూ గాడినపెట్టాలి: సీఎం

- మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలి.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి
- వారిపై అదనపు భారం లేకుండా ఆదాయం పెంచడంపై దృష్టి
- 2014 తర్వాత విభజన కష్టాలున్నా13.7 శాతం వృద్ధి రేటు సాధించాం
- జగన్ రివర్స్ నిర్ణయాలతో అది 10.59 శాతానికి తగ్గింది
- తలసరి ఆదాయమూ ఢమాల్.. వెనుకబడిన శాఖలు క్రియాశీలం కావాలి
- జనవరిలో పీ-4 విధానం: చంద్రబాబు నిర్దేశం





## 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తే లక్ష్యం..

- రోహ్మా సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేయండి
- పానాసోనిక్ ప్లాంటు పెడతామంటే సహకరిస్తాం
- ఆయా కంపెనీలకు డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం
- ముగిసిన విదేశీ పర్యటన.. నేడు హైదరాబాద్‌కు రాక

# శివశక్తి షిరిడిసాయి అనుగ్రహపీఠంలో శ్రీచక్రాల ప్రతిష్ఠాపన





యాదాద్రి భువనగిరి , వార్తమిర్రర్ : జగద్గురు చతుర్వేద జ్ఞానబ్రహ్మ శాస్త్రీయ శ్రీచక్ర రూపకర్తా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారి ఆధ్వర్యములో 1018 పంచలోహ శ్రీచక్రాల ప్రతిష్ఠాపనం దేవీనవరాత్రులలో జరుగుచున్న శుభ సందర్భంగా ఈరోజు శుభముహూర్తంలో మహర్షి ద్వారపూజ మంత్రోచ్చారణతో అనుష్ఠానం చేస్తూ మహాలయ ప్రవేశం చేశారు. దీపారాధనతో కార్యక్రమం ప్రారంభించి పవిత్రీ కరణంతో ఘంటానాదం చేసి భూత శుద్ధి గావించారు. ప్రాణాయామంతో త్రిపురాన్యాసములు చేసి పీఠపూజ చేశారు. తరువాత గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, పంచగవ్య పాశనం చేసి ఆసన పూజనం చేశారు. ఈ దశరాత్రులలో జరిగే కార్యక్రమాలు శ్రీచక్ర ప్రతిష్ఠలు విజయవంతంగా పవిత్రంగా నిర్వహించబడాలని దీక్షా కంకణ ధారణ చేసి మందిర పూజ, కలశ పూజ, ఆసన్యాసము, ముద్రాన్యాసము, అంతర్యాగ



బహిర్యాగ విధానంతో త్రిపురాన్యాసం చేసి షోడశోపచార పూజనం చేసారు. సహస్ర యంత్ర పూజ, శాస్త్రోక్తంగా చేశారు.

# సనాతన ధర్మంపై దాడిని సహించం!

ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం, సిక్కు తదితర అన్యమతాలను గుండెల నిండా గౌరవిస్తాను. వసుధైక కుటుంబంగా అన్ని ప్రాణులు, జాతులు, ప్రాంతాలు సుఖంగా ఉండాలని కోరుకునే సనాతనధర్మానికి నిలువెత్తు ప్రతిరూపం శ్రీరాముడు. అనేక పేర్లతో పిలుచుకునే ఏడుకొండల వాడి ప్రసాదంలో అపచారం జరిగింది. దానికి నేను ప్రాయశ్చిత్త దీక్ష చేపడితే రాజకీయం, అపహాస్యం, అవహేళన చేస్తున్నారు. సనాతన ధర్మాన్ని పాటించడం పాపంగా మాట్లాడుతున్నారు”

“సనాతన ధర్మ పరిరక్షణ కోసం రాజకీయ స్థాయిని, అధికారాన్ని, పదవులను పోగొట్టుకోవడానికి కూడా సిద్ధమే. 21 ఏళ్ల వయసులో ఇదే తిరుపతిలో సనాతన ధర్మాన్ని ఆచరించడం మొదలుపెట్టాను. ఇన్నేళ్లలో ధర్మాన్ని ఎప్పుడూ తప్పలేదు. నమాజ్ వినిపించగానే గౌరవ సూచకంగా ప్రసంగాలను నిలిపివేశాను. నిన్న నా కుమార్తె రష్యన్ క్రిస్టియన్ కావడంతో తిరుమలలో డిక్లరేషన్ ఇప్పించి నా చిత్తశుద్ధి చూపించాను. గెలుపోటములతో నిమిత్తం లేకుండా ఏ దారైతే ముందుకు తీసుకెళ్తుందో అదే నా దారి. ఏ దారైతే అపజయం కూడా అగ్నిజ్వాలై మండుతుందో అదే నా దారి. ఏ మార్గంలో మరణం కూడా మహాప్రభంజనమవుతుందో అదే నా మార్గం. సనాతన ధర్మాన్ని కొందరు వైరస్ అంటున్నారు. అందరం కొలిచే శ్రీరాముడిని పాదరక్షలతో కొడుతూ ఊరేగింపు తీశారు. శ్రీరాముడి విగ్రహం తల నరికేశారు. జంతువుల కొవ్వు కలిపిన కల్తీ నెయ్యితో తయారుచేసిన ప్రసాదాలను శ్రీవారికి నైవేద్యంగా పంపారు. వాటినే అయోధ్య రాముడికి పంపారు. దేశ ప్రతిపక్ష నాయకుడు అయోధ్య రామాలయ ప్రారంభ వేడుకలను ‘నాచ్ గానా’ (తైతక్కలు) అంటూ అవహేళన చేశారు. మోదీని, నన్ను ద్వేషించండి. కానీ, రాముడ్ని ద్వేషించవద్దు. హిందువులుగా మేమెవరం నోరెత్తకూడదా? బాధపడకూడదా? ఏదైనా అంటే మాత్రం హిందూ మతతత్వవాదులైపోతాం. ఇదే విధంగా క్రైస్తవులను, ఇస్లామ్‌ను అనగలరా? అంత ధైర్యం ఉందా?”

**జగన్‌పై కేసులను సుప్రీం గమనించాలి...**

“తిరుమల ప్రసాదం కల్తీ వ్యవహారాన్ని చిన్న విషయంగా భావించకూడదు. లడ్డూ కల్తీ కేసులో సుప్రీం కోర్టు కొన్ని వ్యాఖ్యలు చేసింది. నాకు సుప్రీం కోర్టుపై, న్యాయ వ్యవస్థపై గౌరవం ఉంది. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఏమి జరిగింది? తిరుమలలో పవిత్రత ఎలా దెబ్బతినింది? అన్న విషయాలు ఆలోచించాల్సి ఉంది. లడ్డూ కల్తీకి మాజీ సీఎం జగన్ ప్రత్యక్షంగా కారణమని నేనెప్పుడూ ఆరోపించలేదు. కానీ, ఆయన పాలనలో ఏర్పాటైన టీటీడీ బోర్డు సరైన నిర్ణయాలు తీసుకోనప్పుడు దానికి జగనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. సీఎం చంద్రబాబు లడ్డూ కల్తీ విషయాన్ని మీడియాతో మాట్లాడలేదు. ఎమ్మెల్యేలతో సమావేశంలో మాత్రమే మాట్లాడి వాస్తవాలు చెప్పారు. టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిక్లీన్‌చిట్ ఇచ్చుకోవడానికి ముందు బోర్డులో ఆయన తన హయాంలో ఏమి చేశారో దేశానికి చెప్పాలి. శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు చేసి విరాళంగా రూ.10,500 తీసుకుని రూ.500కు మాత్రమే రశీదు




ఇచ్చారు. లడ్డూ కల్తీ చిన్న వ్యవహారం కాదు. దీని వెనుక చాలా ఉంది. వేల కోట్లు స్వాహా చేసిన వ్యక్తి ఏం తెలియనట్టు నటిస్తూ సుప్రీం కోర్టుకు వెళ్లారు. టీటీడీలో అక్రమాలపై గత ఐదేళ్లుగా చెబుతునే ఉన్నాం. జాతీయ మీడియాకు ఆధారాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. జగన్ అమాయకత్వం నటిస్తున్నారు. జగన్‌పై 29 కేసులు నమోదై ఉన్నాయి. వేల కోట్లు స్వాహా చేశారు. ఆయన పాలనలో 31 వేల మంది యువతులు అదృశ్యమయ్యారు. 290 గుడులు ధ్వంసం చేశారు. రాముడి విగ్రహం తల నరికేశారు. అంతర్వేదిలో రథాన్ని కాల్చివేశారు..వీటన్నింటిని కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుని తీర్పు ఇవ్వాలి”

**ధర్మారెడ్డి ఏమైపోయారు?**

“తాను తప్పు చేయలేదని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి హారతులు వెలిగిస్తున్నారు. అలాంటి డ్రామాలు వద్దు. దీనిపై పాత ఈవో ధర్మారెడ్డి ఎందుకు మాట్లాడడం లేదు? ఆయన ఏమైపోయారు? ఎక్కడున్నారు? తిరుమల పవిత్రత విషయంలో ఎన్ని ఉల్లంఘనలు జరిగాయో నాకు తెలుసు. కొడుకు చనిపోతే ఆలయంలోకి రాకూడదు. అయినా ధర్మారెడ్డి శ్రీవారి ఆలయంలోకి వచ్చారు. ఆమాత్రం ఆచారాలు పాటించలేని వ్యక్తి ఈవోగా ఎలా ఉన్నారు? ఆయనపై 2005లో కూడా చాలా ఆరోపణలు వచ్చాయి. వాటిని బయటికి తీసుకొస్తాం. తిరుమల లడ్డూను కల్తీ చేయడం సనాతన ధర్మంపై దాడి” “ఇదే తిరుపతిలో గతంలో జరిగిన వారాహి సభలో టీటీడీలో అపచారం జరుగుతోందని, సరిదిద్దుకోవాలని చెప్పాను. అయితే భగవంతుడు 11 సీట్లకు కుదించినా ఇంకా బుద్ధి రాలేదు. ఈసారి ఎన్నికలు పెట్టమని చెప్పండి. ఒకటికి పరిమితం చేద్దాం. ఇలా మాట్లాడే అవసరం రాదనుకున్నాను. అయితే వైసీపీ నాయకులే ఆ పరిస్థితి కల్పించారు”

# ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా మాదిగ ప్రొఫెసర్‌ను నియమించాలి

## ఎంఎస్ఎఫ్ తెలంగాణ
## రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ




సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 3 ....తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించడం కోసం ప్రభుత్వం సచివాలయంలో సెర్చ్ కమిటీ మీటింగులను ఏర్పాటు చేయబోతున్న సందర్భంగా... తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ ను ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎంఎస్ఎఫ్ గా కోరుతున్నామని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజి ప్రాంగణంలో ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ కోరారు. ఈ మేరకు ఆయన అధ్యక్షతన ప్లకార్డుల ప్రదర్శన కార్యక్రమం జరుగగా... ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ 107 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీకి గత సమైక్యాంధ్ర పాలకుల నుండి మొదలుకొని స్వరాష్ట్రమైన తెలంగాణలో గత 10 సంవత్సరాలుగా పాలకులు మాదిగలపై వివక్ష చూపి వీసీలుగా నియమించకుండా పాలన పరమైన పదవుల నియామకాల్లో అణచివేచే ధోరణితో వ్యవహరించారన్నారు..పరిపాలన అనుభవం, సీనియారిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అన్ని అర్హతలు కలిగి ఉన్న మాదిగ ప్రొఫెసర్లను తెలంగాణలోని ప్రధాన యూనివర్సిటీ అయిన ఉస్మానియా యూనివర్సిటికీ వైస్ ఛాన్సలర్ గా నియమించాలని సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఉన్నత విద్యా మండలిలో కూడా మాదిగలకు కనీసం ప్రాతినిధ్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు.. ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జరిగిన ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం, ఆట ఆడే దగ్గర, పాటలు పాడే దగ్గర, జైళ్లకు వెళ్లే దగ్గర, ప్రాణ త్యాగాలు చేసే దగ్గర, ఉద్యమాన్ని సజీవంగా నడిపించడం కోసం వ్యూహకర్తలుగా, ప్రధాన ఉపన్యాసకులుగా ఉన్న వాళ్లలో మాదిగ కులానికి చెందిన ప్రొఫెసర్లు,విద్యార్థులు, ప్రజలే ముందు వరుసలో ఉన్న విషయాన్ని గమనించాలన్నారు.మాది ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పాలకుల వలె వివక్ష చూపకుండా, మాదిగలకు పాలనాపరమైన అడ్మినిస్ట్రేటివ్ నియామకాల్లో సముచితస్థానం కల్పించి సామాజిక న్యాయం చేయాలన్నారు.మీ రాజకీయ ఎదుగుదలలో అన్ని విధాలుగా అండగా నిలబడిన మాదిగలకు సీఎం హోదాలో మీరు న్యాయం చేసి మాదిగ జాతి రుణం తీర్చుకోవాలన్నారు.పరిపాలన అనుభవం మరియు సామాజిక స్పృహ కలిగి ఉండి అకాడమిక్ వాతావరణాన్ని కల్పించగలిగే మాదిగ ప్రొఫెసర్లపై కావాలనే ఓర్చుకోలేని కొందరు ప్రొఫెసర్లు కుట్ర బుద్ధితో బహుజన,ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘాల పేరుతో సామాజిక స్పృహలేని కొందర్ని ఈ సమయంలో ఉసికొల్పి నిరాధార ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.ఇప్పటికైనా తీరు మార్చుకోవాలనీ లేకపోతే మాదిగ విద్యార్థులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో... మాదిగ విద్యార్థి నాయకులు తాళ్ళ అజయ్,కాంతి ప్రణయ్,దుర్గం వెంకన్న,చౌట గణేష్,ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జన్నపాల మహేష్ మాదిగ,ఉపాధ్యక్షులు ఈదుల రాజీవ్ ప్రదీప్ మాదిగ, షాల్మియా,కుర్పాటి ఆంజనేయులు మాదిగ,పందిటి నవీన్ మాదిగ,రవితేజ,కడకుంట్ల ప్రణయ్,ఏర్పుల విజయ్ మాదిగ,కార్తీక్, ప్రేమ్,వేణు మాదిగ,రామకృష్ణ మాదిగ,శ్రీను, పరమేశ్,మధు తదితరులు పాల్గొన్నారు

# పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

పేరిట ఇండ్లు కూల్చడం, ఫార్మాసిటీ కోసం భూములు కొల్లగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా అని ఆయన ధ్వజమెత్తారు. మూసీని శుద్ధి చేస్తా అంటూనే పాలవంటి మంజీరాను విషపూరితంగా మారుస్తారా అని హరీశ్ ప్రశ్నించారు. రైతులు భయపడాల్సిన పనిలేదని, తన ప్రాణాలు అడ్డుపెట్టయినా భూములను కాపాడుతానని ఆయన భరోసా కల్పించారు. డప్పూరు రచ్చబండ కార్యక్రమంలో పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. భూములను నమ్ముకొనే పిల్లలను చదివిస్తున్నామని, కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. ప్రాణాలు పోయినా భూములివ్వబోమన్నారు.

# 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తే లక్ష్యం..

కృషి చేస్తామని వారు చెప్పారు. సాయంత్రం పానాసోనిక్ కంపెనీ కార్యాలయంలో ఆ కంపెనీ ప్రెసిడెంట్ నబి నకానీషితో భట్టి సమావేశమై ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల గురించి మాట్లాడారు. తెలంగాణలో ఎలక్ట్రానిక్ వాహనాల సంఖ్య పెరుగుతోందని, ఆర్టీసీలో పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ బస్సులను వినియోగించాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం వారికి చెప్పారు. ఈ దృష్ట్యా తెలంగాణలో పానాసోనిక్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. అనంతరం టోజీ బౌద్ధ ఆలయాన్ని భట్టి సందర్శించారు. అక్కడి బౌద్ధ గురువు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. తెలంగాణలో పలు బౌద్ధ క్షేత్రాలు ఉన్నాయని, వాటిని సందర్శించడానికి రావాలని బౌద్ధ గురువును భట్టి ఆహ్వానించారు. కాగా, డిప్యూటీ సీఎం విదేశీ పర్యటన గురువారంతో ముగిసింది. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఆయన హైదరాబాద్‌కు రానున్నారు. గత నెల 24న ప్రారంభమైన విదేశీ పర్యటనలో భాగంగా తొలుత ఆయన వారం పాటు అమెరికాను సందర్శించగా.. ఆ తర్వాత జపాన్‌లో మూడ్రోజుల పాటు కొనసాగింది.

# 15% వృద్ధి రేటు లక్ష్యం

తగ్గించవచ్చు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడం మాత్రమే కాదు. ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడం ముఖ్యం. 2014 తర్వాత రాష్ట్ర విభజన కష్టాలు ఉన్నా.. నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7 శాతం వృద్ధి రేటు సాధించింది. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రివర్స్ నిర్ణయాలతో వృద్ధి రేటు 10.59 శాతానికి తగ్గింది. 2019లో తెలంగాణతో మన జీఎస్డీపీ వ్యత్యాసం కేవలం 0.20 శాతం ఉండేది. అది 2024కి 1.5 శాతానికి పెరిగింది. 2014-15 మధ్య మన రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా.. నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో 2019 నాటికి రూ.1,54,031కి పెరిగింది. తెలుగుదేశం హయాంలో తలసరి ఆదాయం వృద్ధి 13.21 శాతం ఉండగా.. గత ప్రభుత్వంలో అది 9.06 శాతమే. తలసరి ఆదాయంలో వృద్ధి పడిపోయి.. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. నాడు తెలంగాణకు, మనకు మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం కేవలం 0.16 శాతం ఉంటే.. గత ప్రభుత్వంలో అది 1.84 శాతానికి పెరిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయంలో ఆంధ్ర 5వ స్థానంలో ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ శాఖలు విజన్ సిద్ధం చేసుకుని నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేయాలి’ అని నిర్దేశించారు. కొన్ని శాఖలు బాగా వెనుకబడి ఉన్నాయని.. అవి క్రియాశీలం కావాలన్నారు. ఆయా రంగాల్లో లక్ష్యాలపై ప్రణాళికలతో రావాలని అధికారులను ఆదేశించారు. జనవరిలో పీ-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్ట్‌నర్‌షిప్) విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నామని, దీని ద్వారా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు.. ఆర్థికంగా అట్టడుగున ఉన్న 10 శాతం మందిని పైకి తెచ్చేందుకు సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు.. సంపన్నులు, సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచడానికి, వారికి అవకాశాలు కల్పించడానికి సలహాదారుగా దోహదపడాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

**నేడు తిరుమలకు సీఎం**

తిరుపతి/అమరావతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తిరుమలను సందర్శించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవేంకటేశ్వర స్వామికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. సాయంత్రం 4.20 గంటలకు గన్నవరం నుంచి విమానంలో బయల్దేరి 5.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి సాయంత్రం 6.30 గంటలకు తిరుమల చేరుకుంటారు. తొలుత బేడి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అనంతరం పట్టువస్త్రాలు తీసుకుని శ్రీవారి ఆలయానికి వెళ్తారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకుని ఆ రాత్రికి తిరుమలలోనే బస చేస్తారు. శనివారం ఉదయం నూతనంగా నిర్మించిన వకుళమాత కేంద్రీకృత వంటశాలను ప్రారంభిస్తారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విమానంలో హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు. అక్కడి నుంచి సోమవారం (7వ తేదీన) ఢిల్లీ వెళ్తారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదలకు సంబంధించి ప్రత్యేక సాయం కోసం కేంద్రంలోని ప్రభుత్వ పెద్దలతో చర్చించే నిమిత్తం ఆయన వెళ్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అదే రోజు ఢిల్లీకి ప్రపంచ బ్యాంకు ఉన్నత స్థాయి బృందం వస్తోంది. ముఖ్యమంత్రి ఆ బృందాన్ని కూడా కలిసి రాజధాని అమరావతికి నిధుల విడుదలపై చర్చిస్తారని అంటున్నారు. రైల్వే జోన్‌కు విశాఖలో భూమి పూజ చేయడానికి ముహూర్తం ఖరారుకు ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కూడా ఆయన సమావేశం కానున్నారు. 8న ఉదయం చంద్రబాబు అమరావతి తిరిగి వస్తారు.



# మల్లేష్‌కు అండగా టీం పంచముఖి

మందమర్రి అక్టోబర్ 3: వార్త మిర్రర్ ప్రతినిధి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై, చికిత్స పొందుతున్న పట్టణంలోని శాంతినగర్ కు చెందిన సునార్కర్ మల్లేష్ కు టీం పంచముఖి సభ్యులు అండగా నిలిచారు. పట్టణ వాస్తవ్యులు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉంటున్న టీం పంచముఖీ సభ్యుడు శరత్ రెడ్డి మల్లేష్ కు, అతని కుటుంబానికి ఆపన్న హస్తం అందించగా, టీ పంచముఖి సభ్యులు గురువారం మల్లేష్ నివాసంలో అతనికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కృష్ణ చైతన్య ఆచార్యులు మాట్లాడుతూ, గతంలో మల్లేష్ కు వీల్ చైర్ అందించినట్లు గుర్తు చేశారు. మల్లేష్ కోలుకునేంతవరకు తమ సంస్థ సహకారం ఉంటుందని, బాధిత కుటుంబానికి భరోసా నిచ్చారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు



## పారిశుద్ధ్య కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన..ద్యాప నిఖిల్ రెడ్డి.

ఊర్కొండ వార్త మిర్రర్ ప్రతినిధి:–ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు దూళ్ళ ఎల్లయ్య(50) బుధవారం ఉదయం గుండె పోటుతో మరణించాడు.మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యూబ్ పాష ద్వారా విషయం తెలుసుకున్న పేద ప్రజల దైవం,జన నేత,మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో అంత్యక్రియలకు రూ"5000 తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు.ఈ నగదును గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువసేన సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యూబ్ పాష మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ఊర్కొండ మండలంల పరిధి లోని అన్ని గ్రామాల ప్రజలను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ,ఏ ఆపద వచ్చిన తక్షణమే స్పందిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్న గొప్ప మనసున్న వ్యక్తి ద్యాప అనిల్ రెడ్డి అని కొనియాడాడు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యూబ్ పాష మరియు పిఎసిఎస్ డైరెక్టర్ ఫరీద్ మరియు కాంగ్రెస్ నాయకులు రొడ్డ బంగారు, కాటమోని వెంకటయ్య,కర్రోల్ల వెంకటయ్య,మహ్మద్ ఖాజ, ఎర్రోళ్ల పరుష రాములు,మాల కృష్ణయ్య, కర్రోల్ శాంతయ్య, బాలస్వామి,సుధాకర్,దూళ్ల రాములు, మహేష్, లక్ష్మయ్య, జంగయ్య, చిన్నయ్య, ఖాసీం, కేశవులు,చంద్రయ్య,శివ వెంకటయ్య, హనుమయ్య, ప్రేమ్,ఆంజనేయులు,తప్పెట బంగారు మరియు యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## యువత స్వయం ఉపాధి తో ఎదగాలి..ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి అక్టోబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:–యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా స్వయం ఉపాధి వైపు ఆసక్తి కనబర్చడం హర్షణీయమని కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్ మండలం మేడిగడ్డ తాండ గేటు సమీపంలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి హైవే ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ దాబా ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్పైవెంకటేష్ మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు మేడిగడ్డ తాండ యూవకులు విజయ్, విజయ్ రాథోడ్,రమేష్,సాయి కుమార్, తావుర్య, హర్యా, నరేష్, మల్లేష్, సిద్దు, సీతారాం ,జైరాం రాజ్‌కుమార్ ,రాజ, సోంల్ల, పవన్, శంకర్, రఘు, సికిందర్ ,జగన్,శ్రీను,కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ కార్డుల సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి.

కల్వకుర్తి అక్టోబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో విఠాయిపల్లిలో 10 వ వార్డులో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని క్షేత్రస్థాయిలో పరిశీలన సమగ్రంగా కచ్చితత్వంతో చేపట్టాలని ఎటువంటి లోపాలకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదులో లోపాలు లేకుండా చూడాలని అధికారులకు తెలియజేశాడు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఒక్క కుటుంబానికి డిజిటల్ కార్డు ఉండాలని ప్రభుత్వం భావించింది. కావున ప్రభుత్వం అందించే అన్ని పథకాలను అర్హులకు అందించేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను చేపడుతుంది అన్ని దీని ద్వారానే రేషన్,కళ్యాణ లక్ష్మి ఆరోగ్యశ్రీ, వంటి సంక్షేమ పథకాల లబ్ధినీ ఆయా కుటుంబాలకు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ 2024 ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కెవిఆర్, అందెల

రంగారెడ్డి జిల్లా ( వార్త మిర్రర్ ప్రతినిధి ). అక్టోబర్ 23: మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని నాదర్గుల్ గ్రామం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మల్కా యశస్వి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి 38వ సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ 2024 ప్రారంభోత్సవ వేడుకల్లో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, దేశ సేవలో మన వంతు పాత్ర ఉండాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి , స్థానిక కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, రామోజీ అమితా శ్రీశైలం చారి, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, అరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారం మనిషికి అమృతం లాంటిది.

**గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారుల్లో పోషణ లోపాన్ని అరికట్టడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.**

**అంగన్వాడీ ద్వారా అందే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



మంగపేట , అక్టోబర్ 3 వార్త మిర్రర్ పోషకాహారం మనిషికి అమృతం లాంటిదని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారుల్లో పోషణ లోపాన్ని అరికట్టడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నందునఅంగన్వాడీ ద్వారా అందే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క రాష్ట్ర ప్రజలను కోరారు. గురువారం మంగపేట మండల కేంద్రం లోని రైతు వేదిక వద్ద మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యం లో "పోషణ్ – మా" సంబరాల జిల్లా స్థాయి ముగింపు వేడుకల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమాజం ఎంత నాగరికంగా అభివృద్ధి చెందుతున్నదో, అంతగా కలుషితం అవుతున్నదని, ఈ సృష్టిలో కలుషితం కానీ పదార్థం ఏమైనా ఉంటే అవి కేవలం తల్లి పాలు మాత్రమే అని అన్నారు. అంత స్వచ్ఛమైన తల్లి పాలు, ముఖ్యంగా ముర్రుపాలు బిడ్డకు అమృతం వంటివని, అవి బిడ్డకు నిండు నూరేళ్ళ భవిష్యత్తును ఇస్తాయని అన్నారు. ములుగు జిల్లా అత్యధికంగా మారుమూల గ్రామాల గిరిజన గూడేలను కలిగి ఉన్నదని, ఈ ప్రాంతాల్లోని అత్యధిక జనాభాకు ఆరోగ్యపరమైన అక్షరాస్యత చాల ముఖ్యం అని అభిప్రాయ పడ్డారు. తల్లి పాల ప్రాముఖ్యత, చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం లో పౌష్టికాహారం గొప్పదనం గురించి ఐసీడీఎస్ ద్వారా ఈ నెల రోజులు పోషణ మా సంబరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీలు గృహ సందర్శన చేసి ప్రభుత్వం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వారు మాత్రమే వివియోగించుకునేలా వాటి ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ద్వారాతెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా నాణ్యమైన పౌష్టికాహారం తో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను 6 సం. ల లోపు వయస్సున్న చిన్నారులకు అందిస్తుందని అన్నారు. తల్లి



తండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు ప్రతీ రోజూ పంపడం వల్ల అక్కడ కృత్యాల రూపంలో బోధించే విద్య ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని అలాగే పౌష్టికాహారం ద్వారా వారు ఆరోగ్యవంతంగా తరవుతారని తల్లితండ్రులకు సూచించారు. జిల్లాలో మరియు రాష్ట్రం లో లోప పోషణతో ఉన్నట్లుగా గుర్తించిన శిశువులను తప్పనిసరిగా సాధారణ స్థాయికి వచ్చేలా చొరవ చూపాలని %×జణా% అధికారులకు సూచించారు.ములుగు జిల్లాలో రక్త హీనత, పోషకాహార లోపం అన్న పదాలు వినపడని రీతిలో గర్భిణీస్త్రీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యం మెరుగు పడాలని, దేశానికే ఆదర్శవంతంగా మన జిల్లాను నిలపాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను క్షేత్ర స్థాయిలో అంకిత భావంతో అందించాలని, నాణ్యమైన సరుకులను మాత్రమే అందించాలని, సరుకుల్లో ఏమైనా నాణ్యత లోపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో లుగా గుర్తించిన చిన్నారుల పైన ప్రత్యేకదృష్టి నిలిపి వారిని సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థాయికి తీసుకురావాలని సూచించారు. అనంతరం 13 మంది గర్భిణీ స్త్రీలకు మంత్రి చేతులమీదుగా సామూహిక సీమతాలు నిర్వహించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందు మండలం కేంద్రం 52 లక్షల నిధులతో బస్ స్టేషన్ నిర్మాణము పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఆర్టీసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారి తుల రవి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రేమలత, మల్లీశ్వరి, ముత్తమ్మ, ఏటూరునాగారంప్రాజెక్టు పరిధిలోని సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది ఇమ్మాన్యుయెల్, శ్రావణి, వీరేంద్ర, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## భూపేష్ గుప్తా నగర్ లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

రంగారెడ్డి జిల్లా ( వార్త మిర్రర్ ప్రతినిధి ). అక్టోబర్ 23: ఎల్ బి నగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తా నగర్ శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంబయ్యాయి. మొదటి రోజు ఆలయ చైర్మన్ నారగోని శ్రీనివాస్ యాదవ్, విగ్రహా ధత రాజి రెడ్డి కుటుంబ సమేతంగా కనకదుర్గ అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు నవరాత్రుల సందర్భంగా .ప్రతి రోజు అమ్మవారికి హెూమం, అభిషేకం, కుంకుమ అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లుఆలయ అర్చకులు వినయ్ శాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, భవాని మాల వేసుకున్న భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం:నిర్మలా జగ్గారెడ్డి

కాప్రా,వార్త మిర్రర్,అక్టోబర్ 03:చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు.చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.గురువారం చర్లపల్లి డివిజన్ లోని సిరి గార్డెన్ లో కాప్రా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి టిజిఐఐసి చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై నూతన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.ఇండస్ట్రియల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు,పావని,టిఫ్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి,గోపాల్ రావు ఐఏఐఏ కమిషనర్ ప్రభాకర్,స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నూతన అధ్యక్షుడు యాదయ్య,ఉపాధ్యక్షుడు మచ్చ అశోక్ గౌడ్,ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్,దామోదర్ చారి కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మెరుగుపడాలంటే రాజగోపాల్ రెడ్డికి విద్యాశాఖ మంత్రిగా అవకాశం ఇవ్వాలి

### యువజన కాంగ్రెస్ నాయకులు గంట సాయి సాగర్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

మంత్రివర్గ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కీలక శాఖను కేటాయించాలి, తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపరచాలంటే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి విద్యాశాఖ మంత్రిగా అవకాశం కల్పించాలి అని అన్నారు యువజన కాంగ్రెస్ నాయకులు గంట సాయి సాగర్ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో గత ప్రభుత్వం విఫలమైందని అన్నారు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో, డిగ్రీ కళాశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాలలు, గురుకుల ఆదర్శ నవోదయ, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరంలో కూడా మౌలిక వసతుల కల్పనలో వెనకబడడం క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయకపోవడం ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు, ఈ మంత్రివర్గ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి విద్యాశాఖ మంత్రిగా అవకాశం కల్పిస్తే తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మెరుగుపడుతుందని తెలిపారు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతావని తెలిపారు యువజన కాంగ్రెస్ నాయకులు గంటా సాయి సాగర్

## నిందితున్ని శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి

**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**

**కురుమ యువ చైతన్య జిల్లా నాయకులు డా, ర్యాకల శ్రీనివాస్ కురుమ**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో కడు పేద కుటుంబానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన హత్యాచార ఘటనను కురుమ యువ చైతన్య జిల్లా నాయకులు డా, ర్యాకల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువన్నపేట గ్రామంలోని సామజికంగా అభివృద్ధికి నోచుకోని కురుమ కులం గొర్ల కాపార్ల సామాజిక వర్గానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న, కడు పేద కుటుంబానికి చెందిన మైనర్ బాలిక పై షరీఫ్ అనే వ్యక్తి(20) అత్యాచారానికి పాల్పడటం మానవత్వం మంటగలిపే సంఘటన నిందితుని తక్షణమే ఉరితీయాలని అయిన డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎంత కఠిన చట్టాలు తీసుకొచ్చిన ఇలాంటి మానవ మృగాలు ఎక్కడొ ఒక్కచోట ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఇలాంటి మానవ మృగాలను బహిరంగంగా ఉరితీయాలని ఇలాంటి సందర్భంలో బాధితుల పక్షాన ప్రభుత్వం అండగా ఉండి మనోధైర్యము కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని డా, శ్రీనివాస్ కురుమ అన్నారు.




## స్వచ్ఛ కాప్రా నిర్మాణాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలి

కాప్రా,అక్టోబర్ 03:పారిశుధ్య నిర్వహణలో కాప్రా దేశంలోనే టాప్ టెన్ జాబితాలో చోటు సంపాదించాలని,స్వచ్ఛ కాప్రా నిర్మాణాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఆరోగ్య,కుటుంబ సంక్షేమ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ కోరారు. గురువారం సఫాయి మిత్ర సురక్ష శివిర్ లో భాగంగా కాప్రా సర్కిల్ లో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబుతో కలసి ర్యాలీకి ఆమె జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కమలానగర్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా తిరిగి కాప్రా సర్కిల్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ నిర్వహించారు.అనంతరం కాప్రా సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో వారు సానిటేషన్, ఎంట మాలజీ సిబ్బంది చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.విధి నిర్వహణలో చేపట్టనున్న పలు అంశాలపై సలహాలు,సూచనలు చేశారు.విధి నిర్వహణపై అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన పది మంది సిబ్బందికి బహుమతులను అంద జేశారు.ఈ సందర్భంగా విధి నిర్వాహణలో ఉపయోగించే గ్లౌజులు, మాస్కులు సిబ్బందికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిసి జగన్, ఏంహెచ్ఓ, ఎంటమాలజీ ఏఈ డి. రమేష్,ఎంటమాలజీ సూపర్ వైజర్లు,పరమేష్, నరసింహ గౌడ్,కనకయ్య,నరేందర్ రెడ్డి, ఎంటమాలజీ,శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నేనావత్ నందులాల్ మృతి బాధాకరం

### - మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

చందంపేట అక్టోబర్ 03 వార్త మిర్రర్ :

చందంపేట మండలం తెల్దేవరపల్లి గ్రామానికి చెందిన నేనావత్ నందులాల్ మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.గురువారం తెల్దేవరపల్లి గ్రామంలో నందులాల్ మృతి దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......నందులాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.నందులాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట మాజీ జడ్పీటీసీ బొయపల్లి శ్రీనివాస్ గౌడ్,రమావత్ మోహన్ కృష్ణ, జర్పుల లోక్య నాయక్,బొడ్డుపల్లి కృష్ణ, తరి గోవర్ధన్,కుక్కముడి లక్ష్మయ్య,తదితరులు ఉన్నారు.



## దేవరకొండలో వ్యక్తి అనుమానాస్పద మృతి

దేవరకొండ అక్టోబర్ 03 వార్త మిర్రర్ :::దేవరకొండ పట్టణంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. దేవరకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన అంకూరి బుచ్చయ్య (30) పట్టణంలోని డిండి రోడ్ లో గల గ్రీన్ గార్డెన్ డాబా లో గత ఐదారు సంవత్సరాలుగా వంట మనిషిగా పనిచేస్తున్నారు. బుధవారం నాడు సెలవు దినం కావడంతో దాబా మూసివేయగా యధావిధిగా గురువారం నాడు దాబా యజమాని వెళ్లి చూడగా ఉదయం సమయంలో అపస్మారక స్థితిలో ఉండగా అది గమనించిన దాబాస్ నిర్వాహకులు పోలీసు వారికి సమాచారం ఇవ్వడంతో దేవరకొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## ఈనెల ఐదు లోపు దృవీకరణ పత్రాలు సమర్పించాలి.

**- డీఎస్సీ 2023 కి ఎంపిక కాబడిన అభ్యర్థులకు శుభాకాంక్షలు.**

**- జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.**

ములుగు, అక్టోబర్ 3, వార్త మిర్రర్ ,

ఉపాధ్యాయ పోస్టులకు అర్హత పొందిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ లోగా వారి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాలో 192 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి డీఎస్సీ పరీక్షల ద్వారా 576 మంది అర్హత పొందారని వీరిలో 1:3 ప్రకారం పోస్టులను భర్తీ చేయడం జరుగుతుంది,1:3 నిష్పత్తిలో ఎంపిక కాబడినటువంటి అభ్యర్థులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు ఐదవ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించబడుతుందను, అర్హత పొందిన వారికి త్వరలోనే అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సంప్రదించాలని ఆ ప్రకటనలో కలెక్టర్ కోరారు.



## సెప్టిక్ ట్యాంక్, డ్రైనేజీ వాటర్ ను ప్లాట్ లలోకి వదులుతున్న సత్పుర అల్ పైన్ అపార్ట్ మెంట్ చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్




శంకర్‌పల్లి: అక్టోబర్ 03: (వార్త మిర్రర్): సత్పుర అల్ పైన్ అపార్ట్ మెంట్ లో నివాసం ఉంటున్న వారు సెప్టిక్ ట్యాంక్, డ్రైనేజీ వాటర్ ను పక్కనే ఉన్న ప్లాట్ లలోకి వదులుతున్నారని స్థానిక ప్రజలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లి వైపుకు వెళ్లే దారిలో ఉన్న సత్పుర అల్ పైన్ అపార్ట్ మెంట్ లో ప్రజలు నివాసం ఉన్నారు. అపార్ట్ మెంట్ కు ఆనుకొని కొన్ని ప్లాట్లు ఉన్నాయి. అపార్ట్మెంట్ నుండి వచ్చే సెప్టిక్ ట్యాంక్, అండర్ డ్రైనేజీ వాటర్ పక్క ప్లాట్ లోకి వదులుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్ పై తగు చర్యలు తీసుకోవాలని, సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవరకొండ అక్టోబర్ 03 వార్త మిర్రర్ ::దేవరకొండ పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం నాడు ఘనంగా ప్రారంభించారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అష్టోత్తర శతనామావళి మంత్రపుష్పం అఖండ దీపారాధన నిర్వహించారు. దేవీ నవరాత్రుల సార్లు భాగంగా దేవాలయంలో పలువురు దంపతులు అమ్మవారి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారికి మాడవీధులలో పల్లకి సేవను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, అధ్యక్షులు చీరల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల భాస్కర్, కోశాధికారి కొత్త సుబ్బారావు, జిల్లా మాజీ అధ్యక్షులు శీల వెంకన్న, గట్టు మల్లయ్య, సముద్రాల సహదేవ్, కర్నాటి పురుషోత్తం కృష్ణయ్య, నీల సంజీవ్ స్వప్న సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్దే నా లక్ష్యం

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు.. కాయితి ఆశాదీప్ రెడ్డి.**



కల్వకుర్తి:అక్టోబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి నియోజకవర్గం తాండ్ర గ్రామం లో గురువారం సాయంత్రం తాండ్ర గ్రామానికి చెందిన కాయితి ఆశాదీప్ రెడ్డి గ్రామ అభివృద్ధి కోసం 10వ వార్డులో గల మొదటి రోడ్డు సిసి రోడ్లు వేయించడానికి 10 లక్షల సహాయం అందించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఇట్టి కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి.జై సింహ రెడ్డి,కాయితి ఆశాదీప్ రెడ్డితో భూమి పూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టిన అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఎన్ ఆర్ జి కొన్ని పనులు చేయడం జరిగిందని ప్రస్తుతం ఉన్న యువ నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని తాండ్ర గ్రామంలో స్వచ్ఛందంగా తన వంతు గ్రామ ప్రజలకు ఊరికి పెద్ద కొడుకు లాగా పని చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే తాండ్ర గ్రామంలో స్వచ్ఛందంగా తన గ్రామ అభివృద్ధికి తనదైన శైలిలో ముద్ర చాటుకున్నారు. వయసు చిన్నదైనా సహాయం చేసే మనసు గొప్పది. తనదైన శైలిలో ముద్ర చాటుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తాండ్ర గ్రామంలో ఆశాదీప్ రెడ్డి తాండ్ర గ్రామ వాసిగా ఉండటం మేము ఎంతగానో అదృష్టంగా భావిస్తున్నామని, అది కూడా కీర్తిశేషులు కాయితి ప్రభాకర్ రెడ్డి. తనయుడుగా తాండ్ర గ్రామానికి సహాయం అందించడంలో తనదైన శైలిలో ముద్ర చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి.ఇలాంటి యువ నాయకులు తాండ్ర గ్రామంలో ఉండడం మేము అదృష్టంగా భావిస్తున్నాము అంతేకాకుండా రాజకీయంలో కూడా రాణించేలా మా అందరి అండ దండలు ఉంటాయని రానున్న జెడ్పి చైర్ పర్సన్ ఎన్నికల్లో అన్ని అంగులున్న ఏకైక వ్యక్తి మన ఆశాదీప్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం తాండ్ర గ్రామానికి చెందిన జాంగిర్ తల్లి మరణించడంతో అతని కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలుగా మేము మీకు అండగా ఉంటామని జాంగిర్ కు తమ సహాయం ఉంటుందని.కాయితి ఆశాదీప్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, జెసింహ, వార్డ్ మెంబర్ బాల కిష్టి,అశోక్,విజయ్, బాలస్వామి,మహేష్, పరుశరాములు, సాయికుమార్,శ్రీకాంత్, ఆంజనేయులు,వార్డ్ మెంబర్ వెంకటయ్య,చంద్రయ్య, కృష్ణయ్య,తాండ్ర గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మా బతుకులు రోడ్డు న పడ్డాయి, మాకు మీరే దిక్కు.

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి మొరపెట్టుకున్న వనస్థలిపురం రైతు బజార్ చిరు వ్యాపారులు**



రంగారెడ్డి జిల్లా వార్తా మిర్రర్ ప్రతినిధి....వనస్థలిపురం రైతుబజార్ ముందు పూలు, పండ్లు తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే చిరు వర్తక వ్యాపారులు ఈరోజు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి తమ గోడును ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది చిరు వ్యాపారులు మేము దాదాపుగా గత 30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేసుకుంటున్నామని, గత ఐదు రోజుల క్రితం తోపుడుబండ్లను తీసేసి మా నోట్లో మట్టి కొడుతున్నారు, అని వ్యాపారులు సుధీర్ రెడ్డికి మొరపెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మాలాంటి చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం చాలా బాధగా ఉంది అని వారు సుధీర్ రెడ్డికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వ్యాపారులను అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ నేను గత మూడు నెలల నుండి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను అందుకే ఎల్బీనగర్ నియోజకవర్గంలో సరిగా పర్యటించలేకపోయాను అని అన్నారు. మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారులతో మాట్లాడి ఒక పరిష్కార మార్గం చూపుతాను అని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా చిరంజీవి, సత్తిరెడ్డి, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు ఈ రోజు వనస్థలిపురం రైతు బజార్ దగ్గర పూలు,పండ్లు తదితర వ్యాపారం చేసుకునే వర్తకులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారిని వారి యొక్క క్యాంపు కార్యాలయంలో కలవడం జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మేము దాదాపు 30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.మూడు రోజుల క్రితం అధికారులు వచ్చి మా యొక్క షాప్ లు కులగొట్టడం జరిగింది అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మా యొక్క డబ్బాలు,షాప్ లు,తోపుడుబండ్లు కులగొట్టడం జరిగింది అని రోదిస్తూ సుధీర్ రెడ్డి గారిని విన్నపించుకున్నారు.ఇప్పుడు మా బతుకులు రోడ్డు మీద పడ్డాయి.మాకు న్యాయం చేయండి అని కోరారు.మీరు లేని సమయంలో మాకు అన్యాయం జరిగిందని తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి గారు ప్రతి ఒక్కరిని పలకరిస్తూ నేను గత మూడు నెలల నుంచి అస్వస్థతకు గురై హాస్పిటల్ నందు చేరిక కావడం వల్ల ఇట్టి నియోజకవర్గనికి రాలేక పోవడం జరిగింది అని గుర్తు చేశారు.మీ యొక్క సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధికారులచే మాట్లాడి ఒక పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, చిరంజీవి ,సత్తిరెడ్డి,సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం.

**సంబంధిత అధికారులు రోడ్ల పనులను త్వరితగతిగా పూర్తి చేయాలి.**

**సొంత ఇంటి కలను నెరవేరుస్తాం::**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



ములుగు, అక్టోబర్ 3 వార్త మిర్రర్ రానున్న కొద్ది కాలంలోనే జిల్లాలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, ఆయా శాఖల అధికారులు మంజూరైన రోడ్ల పనులను త్వరత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు మండలంలోని జంగాలపల్లి క్రాస్ నుండి ఎరుకల వాడ వరకు 80 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్డు పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్ అండ్ బి శాఖల ద్వారా దాదాపు 140 కోట్ల రూపాయలతో రోడ్డు పనులను చేపట్టడం జరుగుతుందని, 30 సంవత్సరాల గ్రామీణ ప్రాంతాల ప్రజల కల నెరవేరబోతున్నదని అన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టిన రోడ్డు పనులను రెండు మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా చొరవ చూపాలని, ఇటీవలనే 33 కోట్ల రూపాయలతో జంగాలపల్లి నుండి అంకన్నగూడెం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధికి ఎక్కడంతో పాటు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ, లక్నవరం సరస్సు లాంటి ప్రాంతాలకు జాతీయ రహదారితో అనుసంధానం చేస్తూ రోడ్డు వెడల్పు కార్యక్రమాలను చేపట్టబోతున్నామని స్పష్టం చేశారు. అత్యవసర సమయంలో ప్రతి ఒక్కరికి రోడ్డుతో అవసరం ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ములుగు నియోజకవర్గానికి గతంలో 3 వేల 500 వందల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా నిరుపేదలకు అధిక మొత్తంలో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ఉద్దేశంతో 5000 ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని, రానున్న రోజులలో ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో నిరుపేదలకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ పేరుతో నిర్మించే ఇంట్లో నిర్మాణ పనులను పూర్తిచేసి సొంత ఇంటి కలలు నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ వీరభద్రం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ 20వ వార్డులో ఇంటింటా డిజిటల్ కార్డ్ సర్వే

**ఈనెల 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు కొనసాగనున్న సర్వే**

**ప్రజలందరూ అందుబాటులో ఉండి సహకరించాలి**

**దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, ఎమ్మార్వో సంతోష్ కిరణ్**



దేవరకొండ అక్టోబర్ 03 వార్త మిర్రర్ దేవరకొండ మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకంగా ప్రజలకు అందుబాటులో కుటుంబ డిజిటల్ కార్డును ఇవ్వడానికి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసిన 20వ వార్డు నందు అధికారులతో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా దేవరకొండ రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీరాములు, మండల తాసిల్దార్ సంతోష్ కిరణ్, వార్డ్ కౌన్సిలర్ కొండ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో 20వ వార్డులో సర్వే లో ప్రజలకు అవగాహన కల్పించారు. వారితోపాటు పురపాలక సంఘ ఉద్యోగులు రెండు టీములుగా ఏర్పడి ప్రతిరోజు 30 ఇళ్లలో సర్వే చేస్తారని, అదేవిధంగా వార్డు ప్రజలు అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా దేవరకొండ రెవిన్యూ డివిజన్ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేకు ప్రజలు సహకరించాలని, మున్సిపాలిటీ పరిధిలో డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే చేపట్టడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం అని ఆయన అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఉద్యోగులు ఈనెల 3వతేదీ నుంచి 7వతేదీ వరకు సర్వే చేపడతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, మున్సిపాలిటీ ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోకిలలో ఉడిపి'స్ ఉపహార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించిన చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు

శంకర్‌పల్లి: అక్టోబర్ 03: (వార్త మిర్రర్): శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామ శివారులో గల సుభిషి టౌన్ సెంటర్ లో 40వ ఉడిపి'స్ ఉపహార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రెస్టారెంట్ నిర్వాహకులు జోగినపల్లి అరుణ్, రఘులను ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మోకిల రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్నదని ఇలాంటి రెస్టారెంట్ ల అవశ్యకత ఉందన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని, వారిని దృష్టి లో ఉంచుకుని మెరుగైన సేవలు కల్పించాలన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు జోగినపల్లి అరుణ్, రఘులు మాట్లాడుతూ.. తమ వద్ద, ఇండియన్, చైనీస్, తందూరి, అన్ని రకాల ప్యూర్ వెజ్ రుచికరమైన వంటకాలు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పిసిసి కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## శంకర్‌పల్లిలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

శంకర్‌పల్లి: అక్టోబర్ 03: (వార్త మిర్రర్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సంతోషిమాత ఆలయంలో గురువారం అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమాన్ని స్థానికులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టింపజేసి బాలా త్రిపుర సుందరి అవతారంలో ఉన్న అమ్మవారికి పురోహితుడు రాజేశ్వర్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వివిధ పార్టీల నాయకులు, భవాని మాలధారణ పాల్గొన్నారు.



## ఫార్మాసిటీలో ఒక్క రైతును నష్టపోనివ్వం

**- జెన్నాయిగూడ దళితులకు లేఅవుట్ అభివృద్ధి చేసిన స్థలాలు ఇస్తాం**

**- పరిహారం ఇచ్చాకే పనులు మొదలు పెడతామని కె ఎల్ ఆర్ హామీ**

రంగారెడ్డి జిల్లా ( వార్త మిర్రర్ ప్రతినిధి ). అక్టోబర్ 3: మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన రైతులకు అందరికీ న్యాయం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. వీరితో పాటు రావిర్యాల – జెన్నాయిగూడ రైతులు సైతం కేఎల్ఆర్ ను తుక్కుగూడ కార్యాలయంలో కలిశారు.టీజీఐసీసీ అధికారులు, స్థానిక నాయకులతో చేర్చించి... ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం, గతంలో ఇచ్చిన పట్టాలు, అభివృద్ధిపై పేదలకు భరోసా ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎవరైనా... ఇల్లీగల్ గా స్థలాలు పొందినా వారిని గుర్తించి లిస్ట్ నుంచి తొలగించాలని కేఎల్ఆర్ తెలిపారు. 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న జెన్నాయిగూడ భూనిర్వాసితులకు ఒకే చోట ప్లాటింగ్ చేసి ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని కిచ్చెన్నగారు హామీ ఇచ్చారు.కందుకూరు మండలం 4 గ్రామాల్లో ఫార్మాలో భూములు కోల్పోయిన వారికి ప్లాట్లు – పరిహారం వచ్చేలా చూడాలని కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డికి సూచించారు. అందుకు సంబంధించిన లీగల్, ప్రభుత్వ పరమైన సమస్యలపై దృష్టి పెట్టి ఫార్మా రైతులకు అండగా ఉండాలని బొక్క జంగారెడ్డికి చెప్పారు.అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన నియోజకవర్గం ప్రజలతో మమేకం అయ్యారు కేఎల్ఆర్. సమస్యలు లేని మహేశ్వరం కావాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.



## రుణ మాపీ అమలు చేయించండి మైతపూర్ రైతుల వినతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 3 రుణమాపీ అమలు చేయించాలని జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసిన రాయికల్ మండలం మహిత పూర్ రైతులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైతాపూర్ గ్రామంలో దాదాపు 200 మంది పైడుమడుగు ఇండియన్ బ్యాంకులో రుణాలు పొందారని, ఈ బ్యాంకులో మెజారిటీ శాతం రైతులకు రుణమాఫీ అమలు కాలేదని, రుణమాఫీ అమలు చేసే విధంగా కృషి చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే జగిత్యాల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ తో మాట్లాడి సమస్య తెలుసుకొని, ప్రభుత్వం దృష్టికి వ్యవసాయ శాఖ మంత్రి ,ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి 100 శాతం రుణమాఫీ అమలుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మెన్ గన్నె రాజీరెడ్డి, రఘుపతి రెడ్డి, గంప ఆనంద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## వికారాబాద్ జిల్లా యూత్ అధ్యక్షులుగా సి.అనీల్ నియామకం

**తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి**

**బషీరాబాద్ మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా మోహన్, మహేష్**

వికారాబాద్, అక్టోబర్02( వార్త మిర్రర్ )వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం బిచ్చల్ గ్రామానికి చెందిన సి.అనీల్ ను వికారాబాద్ జిల్లా యూత్ అధ్యక్షులుగా, బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన సి.మోహన్ ను బషీరాబాద్ మండల అధ్యక్షులుగా ,బషీరాబాద్ మండలం గొటికె గ్రామానికి చెందిన సి.మహేష్ ను బషీరాబాద్ మండల ఉపాధ్యక్షులుగా నియమిస్తూ తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, జిల్లా అధ్యక్షులు సి.రవీంధర్ వారికి నియామక పత్రం అందజేశారు.ఈసందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో అప్పజెప్పిన భాధ్యతలను జాతి అభివృద్ధి కోసం ఎస్సీ రిజర్వేషన్ కోసం హక్కుల కోసం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ పిలుపు మేరకు పనిచేస్తామని అదేవిధంగా రాష్ట్ర, జిల్లా కమిటీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర, జిల్లా కమిటీ తరపున కొత్తగా నియమితులైన వారికి అభినందనలు తెలిపారు.

# మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే ను 5 రోజుల్లో పూర్తి చేయాలి

**సబ్ కలెక్టర్ ఎం నారాయణ అమిత్**



మిర్యాలగూడ అక్టోబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ పైలట్ సర్వే ను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ గురువారం పరిశీలించారు. సర్వే ఎలా చేస్తున్నారని టీమ్ లీడర్లను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఓ శేషగిరిశర్మ, ఎంపిఓరమేష్ లు మాట్లాడుతూ మరణించిన వారిని, వివాహితలను వారి కుటుంబ సభ్యుల నుండి వారి సమాచారం మేరకు తొలగిస్తున్నట్లు తెలిపారు. పెళ్లయిన కోడలు వారి పిల్లలను కార్డు యందు యాడ్ చేస్తున్నామన్నారు. బృందం సభ్యుల హాజరు తీసుకున్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ఇళ్లను సర్వే చేయాలన్నారు. ఐదు రోజులలో సర్వే పూర్తి చేయాలని కోరారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నెంబరు పుట్టిన తేది ఫోన్ నంబరు వ్రాయాలని కోరారు. రుద్రారం గ్రామపంచాయతీ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ సర్వే ఈరోజు ఉదయం ప్రారంభించారు. 188 కార్డులు ఉన్నాయి. మొదటి టీం అధికారిగా ఎంపీడిఓ ఎం.శేషగిరిశర్మ, సీనియర్ అసిస్టెంట్ జమీల్ పాషా, జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి సైదులు, రెండో టీంకు మండల పంచాయతీ అధికారి మాతంగి రమేష్, రెండవ టీం అధికారి వారి టీం సభ్యులు సీనియర్ అసిస్టెంట్ షహబాద్, జూనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ లు ప్రతి ఇంటికి వెళ్లి డాటా సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమం గురువారం నుండి ఐదు రోజులలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి కుటుంబ సభ్యులు వారి పుట్టిన తేది వయస్సు ఆధార్ కార్డు ఫోన్ నంబరు అధికారులకు తెలియజేయాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కుటుంబ యజమానురాలు మహిళల పేరున జారీ చేయబడుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫోటో దిగాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు ఉన్నారు.

## పనిచేసే ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



విశాఖపట్నం వార్త మిర్రర్ ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులు తాము పనిచేసే ప్రదేశంలో ఒత్తిడి లేని మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ మానసిక ఆరోగ్య ఫెడరేషన్ పిలుపు నిచ్చిందని చినవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యాలయం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె. వి రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు పనిచేసే ప్రదేశంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి మానసిక ఆరోగ్యం బాగుండేట్లు చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందేశానికి ప్రాధాన్యత కల్పిస్తూ ఈ ఏడాది మానసిక ఆరోగ్య వారోత్సవాలు జరుపుకోవాలని ప్రపంచ మానసిక ఆరోగ్య ఫెడరేషన్ పిలుపు నిచ్చిందన్నారు. 116 దేశాల నుండి 2000 మందికి పైగా మానసిక ఆరోగ్య రంగ ప్రతినిధులు పాల్గొని మానసిక ఆరోగ్య రంగం గురించి చర్చిస్తారన్నారు. ఈ సంవత్సరం ఎంచుకున్న థీమ్ తక్షణ అవసరం మరియు లోతైన అవకాశం గురించి అవగాహనను ప్రతిబింబిస్తుం దన్నారు. ఉద్యోగస్థులైన పెద్దలు తాము పనిచేసే సమయంలో అనేక విధాలుగా, ఉత్తమంగా పని చేస్తూ జీవనోపాధిని పొందుతారన్నారు. అనారోగ్యానికి దారితీసే మార్గాల్లో మానసిక ఆరోగ్యం మరియు మానసిక శ్రేయస్సు చాలా ముఖ్యమన్నారు. పనిచేసే ప్రదేశంలో డిప్రెషన్ మరియు యాంగ్జయిటీ వంటివి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉన్నాయన్నారు. ఉత్పాదకత, హాజరు మొత్తం పనితీరుపై ప్రభావం చూపుతా యన్నారు. ఇటువంటి మానసిక రుగ్మతలకు చికిత్స చేయకుండా వదిలేస్తే వాటి వల్ల ప్రతి ఏటా ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యయం వృధా అవుతుందని అంచనా వేయబడిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జ్ఞానోదయం పొందిన నాయకులు తమ శ్రామిక శక్తి యొక్క మానసిక ఆరోగ్య అవసరాలను తీర్చడం అనేది వ్యక్తులకు మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన అభివృద్ధికి కూడా అవరస మన్నారు. విశాఖ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.విజయ లక్ష్మి మాట్లాడుతూ, మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 4వ తేదీనుంచి 10వ తేదీ వరకు వారం రోజులు పాటు వివిధ కార్య క్రమాలు జరుగుతాయన్నారు. విశాఖ సైకియాట్రిక సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎన్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, సమాజంలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని, వాటిని ఆదిలోనే పరిష్కరిస్తే ఫలితాలు బాగుంటా యన్నారు. మధ్య వయస్కులైన 60 శాతం మంది ఉద్యోగాలు చేస్తున్నవారిలో 10 నుంచి 15 శాతం ఉద్యోగులకు పలు మానసిక సమస్యలు ఉంటు న్నాయన్నారు. సెలవులు పెట్టడం, డ్యూటీ సక్రమంగా చేయలేకపోవడం, ధూమ పానం, మద్య పానంలకు బానిస అవడం, ఆత్మ హత్య ఆలోచనలు రావడం తదితరమైనవి ఉన్నాయన్నారు. పని ఒత్తిడి , నలుగురిలో కలవలేక పోవడం, కుటుంబ సమస్యలు వల్ల మానసిక సమస్యలు పెరుగుతాయన్నారు. యోగ, ధ్యానం ద్వారా మానసిక సమస్యలను దూరంగా ఉండొచ్చన్నారు. ఆస్పత్రి విభాగాది పతి డాక్టర్‌విజయ లక్ష్మి మాట్లాడుతూ, ప్రతి ఏటా ఒక నినాదంతో మానసిక ఆరోగ్య వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. రోడ్ల మీద తిరిగే మానసిక రోగులను పోలీసులు సాయంతో బోర్డు ఎదుట హాజరు పర్చి ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేస్తా మన్నారు.

## దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు

**ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి**

**- దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు**



దేవరకొండ అక్టోబర్ 03 వార్త మిర్రర్ దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో దసరా పండుగ పురస్కరించుకొని హైదరాబాద్ కు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుండి 11వరకు దసరా పండుగ ఉండడంతో రోజువారీగా నడిపే బస్సులతో పాటు దేవరకొండ నుండి హైదరాబాదుకు 52 బస్సులను నడుపుతోంది అని అదేవిధంగా ఈనెల 13 నుండి 16 వరకు 32 బస్సులను నడిపిస్తామని డిపో మేనేజర్ తెలియజేశారు. ప్రయాణికులకు రద్దీకి అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామని వారు తెలియజేశారు. దేవరకొండ హైదరాబాద్ లో ఉండే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## టూ టౌన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ



మిర్యాలగూడ అక్టోబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ టూ టౌన్ ఇన్స్పెక్టర్ పి. నాగార్జున, ట్రాఫిక్ సిబ్బంది, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్ లో తోపుడు బండ్లతో రోడ్లన్నీ సగం వరకు ఆక్రమణలతో నిండిపోవడంతో వాహనదారులు, పాదాచారులు రోడ్డుపై వెళ్లడానికి వీలులేకుండా ఉంటుందని దృష్టికి రావడంతో గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్లను పక్కకు జరిపించారు. ముఖ్యంగా దుకాణాల ముందు ఇష్టారీతిన వాహనాలు నిలిపి ఉంచడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. దుకాణదారులకు ఒకటికి రెండుసార్లు హెచ్చరించి పద్ధతి మార్చుకోకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. సాగర్ రోడ్ లో ఆటోలు ఇష్టారీతిన నిలపడంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని మా దృష్టికి వచ్చినదని, ఆటోలు కూడా క్రమపద్ధతిలో తిరగనీ యడల చర్యలు తీసుకుంటామన్నారు.



## మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే కార్యక్రమం

మిర్యాలగూడ అక్టోబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్టును గురువారం చేపట్టారు. వార్డులో మున్సిపల్ అధికారులు 6 బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కుటుంబంలో ఎంతమంది అందరి పేర్లు నమోదు, లేని వారిని తొలగిస్తూ ఉన్నారు. నూతనంగా కుటుంబ సభ్యులను, కొత్త కోడళ్లను చేర్చాలని అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్, డిఇఇ వెంకన్న, రెవిన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఎండీ.జాఫర్, జెఎఓ ధనుంజయ, వార్డు కౌన్సిలర్ ఎండీ.ఇలియాస్ లు పాల్గొన్నారు.



## కునమల్ల ప్రకాష్ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 3

జగిత్యాల జిల్లా రాయికల్ మండల అల్లీపూర్ గ్రామ నాయకులు కునమల్ల ప్రకాష్ గుండెపోటు తో మరణించగా వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. వారి వెంట పాక్స్ చైర్మన్ రాజలింగం, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ముఖీద్, ప్రవీణ్, శివ కుమార్, సురేష్, జగదీష్, రత్నాకర్ రావు, జహంగీర్, నాయకులు తదితరులు ఉన్నారు. పరామర్శజి జగిత్యాల జిల్లా బీర్ పూర్ గ్రామానికి చెందిన పూడూరు సతీష్ గారి అమ్మ పూడూరు దుబ్బమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించగా, అదే గ్రామానికి చెందిన చిర్ణేని శ్రీనివాస్, తండ్రి నారాయణ అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ వారి వెంట కేడీసీసీ జిల్లా మెంబర్ రాంచందర్ రావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శిగా మద్దెర్ల శ్యాంసుందర్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 3.. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ కార్యదర్శిగా మద్దెర్ల శ్యాంసుందర్ నియమితులయ్యారు ఈ మేరకు బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన పదవి కోసం కృషిచేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.



## రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని

**- కోవ్వొత్తులతో అమరులకు రైతుసంఘం నివాళ్లు**

మిర్యాలగూడ , అక్టోబర్ 3:- (వార్త మిర్రర్) కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక, నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో లకిమ్ పూర్ ఘటనలో అమరులైన రైతులకు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి కోవొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాట సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. అమరులైన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. ఆ చట్టాలను పుర్తిగా రద్దు చేయాలన్నారు. హామీలు అమలు అయ్యేంత వరకు రైతు ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, సత్యనారాయణరావు, గోవింద్రెడ్డి, కోటిరెడ్డి, రామకృష్ణ, రాజేష్, లింగా నాయక్, బాషా పాల్గొన్నారు.

